క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

జె.పంగులూరు: నేడు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేళ్ళ నాగమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరగనున్నట్లు ఎంపీడీఓ స్వరూపారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీలు హాజరై ప్రజా సమస్యలపై చర్చకు రావాలన్నారు.

సొసైటీ చైర్‌పర్సన్‌గా స్వామి

జె.పంగులూరు: మండల పరిధిలోని జాగర్లమూడివారిపాలెం వ్యవసాయం సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్ పర్సన్‌గా ముప్పవరం గ్రామానికి చెందిన అల్లంనేని బ్రహ్మానంద స్వామి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతో పాటు మరో ఇద్దరిని సభ్యులుగా చేరుస్తూ త్రిసభ్య కమిటీని ప్రభుత్వం ప్రకటించింది. బ్రహ్మానంద స్వామి గతంలో ముప్పవరం గ్రామ సర్పంచ్‌గా, వాటర్ డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్ పర్సన్‌గా, రాజకీయ అనుభవంతో పాటు పరిపాలన అనుభవం కూడా కలిగిన బ్రహ్మానంద స్వామిని సొసైటీ చైర్ పర్సన్‌గా నియమించడం పట్ల పలువురు అభినందిస్తున్నారు. స్వామి కాలంలో సొసైటీ అభివృద్ధి చెందగలదని భావిస్తున్నారు. పంగులూరు మండలంలో మొత్తం 8 సొసైటీలు ఉండగా అందులో ఇప్పుడు జాగర్లమూడివారి పాలెం సొసైటీకి మాత్రమే త్రిసభ్య కమిటీ ప్రభుత్వం ప్రకటించింది. ఇంకా 7 సొసైటీలను ప్రకటించాల్సి ఉంది.

ప్రీమియం చెల్లించండి



వైదనలో మాట్లాడుతున్న ఏఓ

బల్లికురవ: రైతులు ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంటలన్నింటికీ ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో ప్రీమియంలు చెల్లించాలని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు కోరారు. బుధవారం వైదన, కొమ్మినేనివారిపాలెం గ్రామాల్లో సాగు చేసిన మొక్కజొన్న పైరును పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎకరా పంటసాగుకు వరికి రూ.800, మిరపకు రూ. 1800, ప్రత్తికి రూ. 1900, కంది, మినుములకు రూ. 400 చొప్పున ప్రీమియం చెల్లించాలని పంటసాగు చేపట్టగానే ఈ పంటలో నమోదు చేసుకోవాలని ఈవో కోరారు.


అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ

అద్దంకి: అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం అందజేస్తామని ఏడీఏ ఎప్రాయమ్ అన్నారు. ఆయన బుధవారం నాగులపాడు, వేలమూరిపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అన్నిఅర్హతలు ఉండి ప్రకటించిన జాబితాలో పేరు లేని రైతులు గ్రీవెన్స్‌లో నమోదు చేసుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. గ్రావెన్స్ కోసం ఈ నెల 13వ తేదీ లోపు వ్యవసాయసహాయకులను సంప్రదించాలని చెప్పారు. మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ గ్రామ వ్యవసాయ సహాయకులు కోరారు.

40 ఏళ్ల దళిత ఉద్యమాన్ని స్మరించుకోండి

చీరాల రూరల్: దేశవ్యాప్తంగా ఉవ్వెత్తున్న ఎగసిపడిన 40 ఏళ్ల దళిత ఉద్యమాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరరావు అన్నారు. బుధవారం స్థానిక దళిత మహాసభ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నలబై ఏళ్ల క్రితం 17 జూలైన కారంచేడు గ్రామంలోని అగ్రవర్ణాల వారు మాదిగలపై విచక్షణా రహితంగా దాడిచేసి పాశవికంగా ఏడుగురిని హత్యచేసిన సంఘటనపై దేశ వ్యాప్తంగా ఉవ్వెత్తున ఉద్యమాలు జరిగాయని చెప్పారు. తర్వాత అట్రాసిటీ యాక్టు అమలు జరిగిందని చెప్పారు. జూలై 17న భారత దేశ దళితుల ఆత్మగౌరవ ప్రతిఘటన పోరాటాలతో స్మారక సభలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మాచవరపు జూలియస్, మాలమహానాగు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య, కాకుమాను రవికుమార్, గోగులమూడి రంజిత్, ఎర్రమాల శ్రీను, గోశాల అశోక్, గొర్రెముచ్చు ఏలియా పాల్గొన్నారు.

వృద్ధురాలిని పరామర్శించిన గాదె



రాజమ్మను పరామర్శిస్తున్న గాదె మధుసూదనరెడ్డి

ఇంకొల్లు(చినగంజాం): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బిల్లాలి డేవిడ్ అమ్మమ్మ రాజమ్మ అనారోగ్యంతో బాధ పడుతుండటంతో పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి పరామర్శించారు. బుధవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్ళి స్వయంగా కలిసి మాట్లాడారు. కుటుంబ సభ్యులను ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. ఇంకొల్లు టౌన్ ప్రెసిడెంట్ కరి వాసు, అయేషా బుడే, యేషయ్య, కరుణాకర్, రామదాసు, సన్నీ, అజయ్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు చెప్పేదొకటి.. చేసేదొకటి



క్యూర్ కోడ్ ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జ్ గాదె మధుసూదన రెడ్డి, స్థానిక నాయకులు,



చినగంజాం సభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి

● పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి

చినగంజాం: చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిందొకటి అధికారంలోకి వచ్చాక చేసేది మరొకటిగా ఉందని.. అదే ఆయన నైజం అని పర్చూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి అన్నారు. బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ అనే కార్యక్రమంలో భాగంగా మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి అధ్యక్షతన సమాయత్త సమావేశం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. గాదె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిగా సుదీర్ఘ అనుభవం ఉన్న చంద్రబాబు ప్రతిసారీ అధికారంలోకి వచ్చేందుకు మోసపూరితమైన మాటలు చెబుతూ అధికారంలోకి వచ్చాక మోసగిస్తూ వస్తున్నారని విమర్శించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద కుటుంబాలను కష్టకాలంలో ఆదుకుంటే ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి కూడా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడమే కాకుండా కరోనా కష్ట కాలంలో అండగా నిలబడిన గొప్ప నాయకుడన్నారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి తన పాలనలో ప్రజల సంక్షేమం కోసం రూ. 2.76 లక్షల కోట్లు ఖర్చు చేయగా.. చంద్రబాబు రూ. 5 లక్షలు కోట్లు ఖర్చు చేస్తానని హామీ ఇవ్వడంతో అంతా మోసపోయారన్న విషయం ఇప్పటికే తెలుసుకున్నారన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలందరికీ తెలియజేయడం కోసం నాయకుడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఇంటికీ వెళ్ళి ప్రతి కుటుంబానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసం పార్టీ అధిష్టానం ఏర్పాటు చేసిన క్యూర్ కోడ్‌ను తీసుకెళ్ళి వారికి వివరించాల్సి ఉంటుందని వివరించారు. మేనిఫెస్టో అంటే తెల్ల కాగితం కాదని, ప్రజలకు ఇచ్చే వాగ్దానాలని వాటిని వనెరవేర్చకుండా చంద్రబాబు చేస్తున్న మోసాలను అందరికీ తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో కూటమి పాలన వచ్చిన తరువాత మిర్చి, పొగాకు, వరి, వేరుశనగ తదితర పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంలో విఫలమయిందని దుయ్యబట్టారు. మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం కేవలం టీడీపీ నాయకులు సిఫార్సు చేసిన పంటను మాత్రమే కొనుగోలు చేస్తున్నారని గాదె ధ్వజమెత్తారు. అధికారులు సైతం వారితో కుమ్మక్కై రైతులకు అన్యాయం చేస్తున్నారని .. ఈ విషయాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకెళ్ళాలని ఆయన పిలుపునిచ్చారు.

నియోజకవర్గానికి గుండె వంటిది చినగంజాం

పర్చూరు నియోజక వర్గంలో ఉన్న ఆరు మండలాల్లో చినగంజాం మండలం గుండెకాయ వంటిదని గాదె అన్నారు. తన తండ్రి మాజీ మంత్రి గాదె వెంకటరెడ్డి పుట్టింది ఇంకొల్లు మండలం పావులూరు గ్రామం అయినా చినగంజాం మండలాన్ని ఆయన పుట్టిన ఊరుగా భావించారని తెలిపారు. ఒకప్పుడు కాంగ్రెస్ పార్టీకి అడ్డాగా ఉన్న చినగంజాం మండలం ప్రస్తుతం వైఎస్సార్‌సీపీకి అడ్డా అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాటుకూరి బాబురావు, కేవీ సుబ్బారావు చౌదరి, కొల్లాటి ఏడుకొండలు, పాదర్తి ప్రకాష్, కుక్కల వెంకట రమణారెడ్డి, కేవీ రెడ్డి, వాటుపల్లి విజయ రామ ప్రసాద్, మేడికొండ సునీల్, పాకనాటి వెంకట రామయ్య, కొండూరి గోవింద్, గుమ్మడి ఉమాశంకర్ రెడ్డి, సూరిబాబు, అక్కల రామకృష్ణారెడ్డి, అమరా శ్రీను, అనుమాలశెట్టి రామకృష్ణ, మార్కాపురం వెంకట రామారావు, కల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ



బధిరుల ఆశ్రమ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



వృద్ధులకు దుప్పట్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అద్దంకి రూరల్: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి జన్మదినం సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు శింగరకొండ కష్టజీవుల వృద్ధాశ్రమంలోని వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, రాష్ట్ర యూత్ జాయింట్ సెక్రటరీ చందోలు రాజ్‌కుమార్, అద్దంకి నియోజకవర్గ ప్రచార కమిటీ అధ్యక్షుడు టి. మురహరి యాదవ్, క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు పరిమి ప్రసాద్, విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రశాంత్ రెడ్డి, జిల్లా యూత్ నాయకుడు మస్తాన్‌వలి పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం స్థానిక బధిరుల ఆశ్రమ పాఠశాలలో జరిగాయి. కేక్ కట్‌చేసి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంచి పెట్టారు. అద్దంకి పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, మండల కన్వీనర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

నిషేధిత వస్తువుల విక్రయాలు నేరం



స్వర్ణ హైస్కూల్ ఎదురుగా ఉన్న దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ

కారంచేడు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీలు, యూనివర్సిటీలకు 100 మీటర్ల దూరంలో ఉండే పాన్ షాపులు, దుకాణాల్లో సిగరెట్లు, డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను విక్రయించడం నేరమని, అలాంటి వారిపై కఠినమైన చర్యలు తప్పవని ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా హెచ్చరించారు. బుధవారం స్వర్ణ, కుంకలమర్రు గ్రామాల్లోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల వద్ద ఆపరేషన్ సేఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలకు సమీపంలోని దుకాణాలను, పాన్ షాపులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పాన్ షాపుల్లో సిగరెట్ల విక్రయాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ నెల 12వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని అన్ని ప్రాంతాల్లో ఎంపిక చేసిన తోఫెల్ టీం పర్యవేక్షిస్తూ ఉంటుందన్నారు. ఏఎస్ఐ శేషసాయి, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కార్మిక లోకం



పర్చూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



అద్దంకి: సమ్మెలో పాల్గొన్న కార్మికులు



మార్టూరు జాతీయ రహదారిపై ప్రదర్శన



మేదరమెట్లలో మాట్లాడుతున్న మోంద్రు ఆంజనేయులు



పంగులూరు బస్టాండ్ సెంటర్లో మానవహారం చేస్తున్న కార్యకర్తలు

పర్చూరు(చినగంజాం): నియోజకవర్గ కేంద్రం పర్చూరులో ఎర్ర జెండాలు రెపరెపలాడాయి. కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎర్రజెండాలు చేతబట్టి కార్మికులు ర్యాలీ నిర్వహించారు. నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి బొమ్మల సెంటర్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు నల్ల చట్టాలను వెంటనే రద్ద చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పని దినాలను 10 గంటలకు పెంచుతూ ఇటీవల ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోను కూడా వెంటనే రద్దు చేయాలని కోరారు. సీఐటీయూ నాయకులు కె. శ్రీనివాసరావు, నరిశెట్టి ఆచార్యులు, కౌలు రైతు సంఘం నాయకులు బండి శంకరయ్య పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు సమ్మె నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ జరిగింది. సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు, జి. శారద, పి. ఆదాం పాల్గొన్నారు.

మార్టూరు: స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి గన్నవరం రోడ్డు, నాగరాజు పల్లి సెంటర్ మీదుగా స్టేట్ బ్యాంక్ సెంటర్ వరకు ర్యాలీ సాగింది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల హనుమంతరావు, టి. రాణి, సుభాషిణి, చిన్న, అనిత, శ్యామల పాల్గొన్నారు.

మేదరమెట్ల: స్థానిక సెంటర్‌లో వ్యవసాయ కార్మిక సంఘాలతో పాటు ప్రజాసంఘాలు బుధవారం బంద్ నిర్వహించారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు మోంద్రు ఆంజనేయులు, దశరథ, హనుమంతరావు, రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: గ్రామంలోని స్టేట్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఉన్నత పాఠశాల, ఇతర ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ మూసివేయించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. నాగబోయిన రంగారావు, తలపనేని రామారావు, రాయిణి వినోద్ బాబు, గుడిపాటి మల్లారెడ్డి, రామచంద్రరాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను బానిసలుగా మారుస్తారా?



వేటపాలెంలో నిరసన తెలుపుతున్న కార్మికులు

వేటపాలెం: కార్మిక హక్కులను కాలరాసి యజమానులకు.. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్‌ని వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర సీఐటీయూ నాయకులు కె. శ్రీనివాసరావు, జిల్లా నాయకులు ఎన్. బాబూరావు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా వేటపాలెం మండల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్మికులు విధులు బహిష్కరించి బుధవారం నిరసన తెలిపారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో వందలాది కార్మికులు చిన్న బజార్ సెంటర్ మీదుగా సంతరావూరి రోడ్డు , గడియార స్తంభం సెంటర్, రామన్నపేట మీదుగా మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణం వరకు ర్యాలీ నిర్వహించారు. నాలుగు లేబర్ చట్టాలను రద్దు చేయాలని, కనీస వేతనాలు, ఇతర చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని, స్కీమ్ వర్కర్లను , పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని నినాదాలు చేశారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు శ్రీనివాసరావు, బాబూరావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ తెచ్చిన లేబర్ కోడ్స్‌కు రాష్ట్రం ప్రయోగశాలగా మారిందన్నారు. కార్మికులు అనేక ఏళ్లుగా కనీస వేతనాలకోసం, షెడ్యూల్ పరిశ్రమాల్లో వేతనాలు సరవరణ కోసం, ఇతర చట్టబద్ధ సౌకర్యాలు కోసం పోరాడుతుంటే వారి సమస్యలు పట్టించు కోకుండా పది గంటల పనిదినాన్ని ఆమోదించడం, రాత్రి షిఫ్టులలో కూడా మహిళలచే పనిచేయించు కోనే విధంగా తీర్మానం చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికే అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులకు నిర్దిష్ట పని గంటలు, కనీస వేతనాలు అమలు కాక, కార్మికులపై వేధింపులు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర మంత్రి వర్గ నిర్ణయాలు కార్మికులకు మరింత నష్టం కలిగిస్తున్నాయన్నారు. సీఐటీయూ మండల అధ్యక్ష కార్యదర్శులు, బి బ్రహ్మయ్య, ఎం. అయ్యప్ప రెడ్డి, యూనియన్ నాయకులు ఆంజనేయులు, కృష్ణ, కృపమ్మ, చందు, శోభన్ బాబు, అంగన్‌వాడీ నాయకులు ఎ. బ్యులా, పి. ప్రమీల, డి. బుల్లమ్మాయి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రసవ సమయం వరకు జాగ్రత్తగా ఉండాలి

కారంచేడు: గర్భిణులు ప్రసవ సమయం వరకు వారితో పాటు వారిని పర్యవేక్షిస్తున్న వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని కారంచేడు పీహెచ్‌సీ డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రమైన కారంచేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఏ) ద్వారా సుమారు 27 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మూడో నెల వచ్చిన వెంటనే మీ సమీప ఆశా, ఏఎన్ఎంల వద్ద మీ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా వేయించాల్సిన టీడీలు, హిమోగ్లోబిన్ శాతం కూడా గుర్తించి అవసరమైన మాత్రలు, ఆరోగ్య సూచనలు అందిస్తారని వివరించారు. స్కానింగ్ చేసి బిడ్డ ఎదుగుదల విషయంలో వైద్యుల సూచనలు పాటించాలన్నారు. ప్రసవ సమయానికి ముందే స్థానిక ఆశ కార్యకర్తలు మిమ్ములను వైద్యశాలకు పంపించే ఏర్పాట్లు చేస్తారన్నారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఇంటికి చేర్చేలా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ కార్యకర్తల సమావేశం

పర్చూరు(చినగంజాం): బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ అనే కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల స్థాయి సమావేశం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు పర్చూరు అద్దంకి నాంచారమ్మ కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ కఠారి అప్పారావు బుధవారం తెలిపారు. ఈ సమావేశానికి నియోజక వర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి హాజరవుతారని తెలిపారు.

గురు పౌర్ణమికి ఆలయాల ముస్తాబు



నక్కబొక్కలపాడులో అలంకరణలో షిర్డీ నాథుడు

బల్లికురవ: గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించేందుకు మండలంలోని నక్కబొక్కలపాడు, ఉప్పుమాగులూరు గ్రామాలోని షిర్డీ సాయిబాబా అనుగ్రహధాన్య మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. నక్కబొక్కలపాడు గ్రామంలో బుధవారం ఉదయం నుంచి ఆలయంలో సాయినామ సంకీర్తనతో ఏకాహం చేపట్టారు. ఆలయాల్లో బాబాను ప్రత్యేకంగా అలంకరించి నాలుగు వేళల హారతులు ఇచ్చారు. గురువారం జరిగే వేడుకల్లో భక్తులు విరివిగా పాల్గొనాలని అలయ అర్చకుడు ఐ. మధుబాబు, సుధీర్ కోరారు.

31 వరకు పంటల బీమాకు గడువు



కోలలపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సుదర్శన్ రాజు

మార్టూరు: ఖరీఫ్ సీజన్లో పంటల బీమా కోసం మిర్చి, మినుము, వరి పంటలను నోటిఫై చేశామని ఈనెల 31వ తేదీ లోపు రైతులు బీమా ప్రీమియం చెల్లించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.సుదర్శన్ రాజు అన్నారు. మండలంలోని కోలలపూడిలో మంగళవారం రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. త్వరలో సొసైటీల ద్వారా రైతులకు ఎరువులు పంపిణీ చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల రెండో వారంలో పంటల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. మొక్కజొన్న పంటలో సమగ్ర ఎరువుల యాజ మాన్య పద్ధతుల గురించి, ప్రకృతి సేద్యం వలన కలిగే ప్రయోజనాల గురించి ఏవో ఆర్. లావణ్య రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది గోపి కిరణ్ స్థానిక రైతులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు కేంద్రం త్వరలో ప్రారంభం

మేదరమెట్ల: బర్లీ పొగాకు కొనుగోలు చేసేందుకు కొరిశపాడు మండలంలో పొగాకు కొనుగోలు కేంద్రాలను త్వరలో ఏర్పాటు చేస్తామని ఏవో రామోహన్‌రెడ్డి తెలిపారు. కొరిశపాడు మండలంలోని రాచపూడి, మేదరమెట్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నవధాన్యాల కిట్స్ వాటి ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. పొగాకు విక్రయం చేసేసమయంలో తేమశాతం 20 శాతం కన్నా ఎక్కువ లేకుండా చూసుకోవాలన్నారు. పచ్చ, నల్ల ఆకులను గ్రేడింగ్ చేసి కోతవారీగా చెక్కులు కట్టుకోవాలన్నారు. ఈనెల 30లోగా ప్రధానమంత్రి పంటల బీమా పథకం ద్వారా రైతులు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ ఉంటే బిల్లు రాదు

అద్దంకి: పీఎం సూర్యఘర్ యోజనా పథకం ద్వారా విద్యుత్‌వినియోగదారులకు విద్యుత్‌బిల్లు చెల్లించే అవసరం ఉండదని ఎంపీడీఓ శింగయ్య అన్నారు. జార్లపాలెం సచివాలయ సిబ్బంకి పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీఎం సూర్యఘర్‌పై వినియోగదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ పరిశీలించారు. సెంటరులో నలుగురు పిల్లలు మాత్రమే ఉండటం, వారికి గుడ్డు, పాలు ఇవ్వకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటనే ఆ కేంద్రంపై చర్యల కోసం సీడీపీవోకు ఫోన్ చేసి చెప్పారు. అనంతరం ఇంటింటి చెత్త సేకరణపై ఎస్‌డబ్ల్యూపీసీ సెంటరులో అవగాహన కల్పించారు.